ప్రజాశక్తి
శనివారం 6 సెప్టెంబర్ 2025 5
అనంతపురం





సీతారాం ఏచూరి వర్ధంతి సందర్భంగా నగరంలో ప్రదర్శన చేస్తున్న సిపిఎం నాయకులు

సోషలిజంతోనే సంపూర్ణ ప్రజా స్వాతంత్ర్యం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.రాంభూపాల్

సిపిఎం అఖిలభారత మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభను అనంతపురం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు అనంతపురం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నిర్వహించారు. లలిత కళాపరిషత్ నుంచి ఏచూరి చిత్రపటం చేతబట్టి ఎర్రజెండాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప ముఖ్య అతిథులుగా హాజరై ఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ సమాజంలో దోపిడీ, వివక్ష, పెట్టుబడిదారీ, భూస్వామ్య వ్యవస్థ రూపుమాపి సమానత్వం ప్రజలందరికీ కూడు, గూడు, గుడ్డను అందించేలా సోషలిజం దేశాన్ని స్థాపించుకున్నప్పుడే ప్రజలకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అవుతుందన్నారు.

వార్త మెయిన్‌లో

నాడు విద్యావెలుగు.. నేడు సమస్యల నెలవు..!



శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగనహళ్లి ఎపిఆర్‌జెసి జూనియర్ కళాశాల ఎందరో పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపింది. ఇక్కడ చదువుకున్న చాలా మంది ఉన్నత స్థాయికి ఎదిగారు. ఇకప్పడు ఈ కళాశాలలో సీటు వస్తే చాలు.. జీవితంలో స్థిరపడినట్టే అని విద్యార్థులు, తల్లిదండ్రులు భావించేవారంటే ఈ విద్యాలయం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. ఇదంతా గతంలా మారింది. ప్రస్తుతం ఈ విద్యాలయం సమస్యల నెలవుగా మారింది. యువతకు దారి చూపి వారిని ముందుకు నడిపిన కళాశాల సమస్యలతో కునారిల్లుతోంది.





- కొడిగెనహళ్లి ఎపిఆర్‌జెసిలో వసతులలేమి
- శిథిలావస్థలో భవనాలు
- 300 మంది విద్యార్థులకు ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి
- సిఎస్ఆర్ నిధులతో పూర్వ వైభవం వచ్చేనా..?
- ప్రభుత్వ తోడ్పాటు అందిస్తే మరింత ఉపయోగం

ప్రజాశక్తి-పరిగి

హిందూపురం నియోజకవర్గం పరిగి మండలం కొడిగనహళ్లి ప్రాంతంలో ఎపిఆర్‌జెసి జూనియర్ కళాశాలను 1989 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ. 60 లక్షలతో నిర్మించింది. ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్దేశంతో విద్యాలయాన్ని అందుబాటులోకి తెచ్చింది. మూడు దశాబ్దాల పాటు ఈ కళాశాల ఒక వెలుగు వెలిగింది. ఇప్పుడు ఈ కళాశాలలో ఇంటర్‌లో సీటు కోసం చాలా మంది విద్యార్థులు తపన పడుతుంటారు. అలాంటి కళాశాల పాలకుల నిర్లక్ష్యంతో రానురాను దాని ప్రాభవాన్ని కోల్పోతోంది. ఏడాదికేడాది నిధుల కేటాయింపు తగ్గిపోతుండడంతో దీని నిర్వహణ భారం అవుతోంది. 300 మంది విద్యార్థులున్న ఈ కళాశాలకు కేవలం ఒకే ఒక్క రెగ్యులర్ ఉద్యోగి ఉన్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకరు మినహా మిగిలినవారంతా తాత్కాలిక ఉపాధ్యాయులు(గెస్ట్‌ఫ్యాకల్టీలు)తో కాలం వెల్లదీయాల్సిన పరిస్థితి నెలకొంది.

కనిపించని నాటి విద్యా వెలుగులు..!

దాదాపు 20 ఎకరాల విస్తీర్ణంలో ఎపిఆర్‌జెసి ఉంది. ఇందులో చదవిన విద్యార్థులు అనేక మంది అటు చదువులో ఇటు ఆటల్లో రాణించి దేశ స్థాయిలో గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు రంగాల్లో ఉద్యోగాలు సంపాదించి ఉన్నత శిఖరాలు అదిరోహించారు. ప్రస్తుతం ఈ కళాశాలను పలు సమస్యలు వెంటాడుతున్నాయి. సుమారు 300 మంది విద్యార్థులు ఇక్కడ చదవుతున్నారు. వీరందరికీ ప్రధానాచార్యులు తప్ప మిగిలా బోధనా సిబ్బంది 17 మంది తాత్కాలిక ఉపాధ్యాయులు (గెస్ట్ ఫ్యాకల్టీ)గా పని చేస్తున్నారు. వారికి కూడా చాలీచాలని వేతనం వస్తోంది. అది కూడా మూడు, నాలుగు నెలలకు ఒకసారి వారికి అందుతోంది. ఇక విద్యార్థులకు భోజనం విషయం మరింత దారుణంగా ఉంది. ఇక్కడ కేవలం ఇద్దరు మాత్రమే వంట మనుషులు విధులు నిర్వర్తిస్తున్నారు. వారిలో కూడా ఒక్కొక్కరు రెండు మూడు రోజులు సెలవు తీసుకునే పరిస్థితి ఉంది. కళాశాలకు వంట మనుషుల కేటాయింపు విషయంలో ఉన్నతాధికారుల తీరు దారుణం ఉంది. పాఠశాల సమయానికి భోజన సదుపాయం కల్పించలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మూలనబడ్డ బెంచీలు

ఇంటర్ నాలుగు గ్రూపులతోనే సరి

ఇంటర్మీడియట్ విద్యకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో కళాశాలలో నాలుగు గ్రూపులు మంజూరు చేశారు. ఎంపిసి, బైపిసి, సిఇసి, హెచ్ఇసి గ్రూపుల ద్వారా విద్యాబోధన జరుగుతోంది. మారిన టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులకు నూతన గ్రూపులను కళాశాలకు కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవటం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఇదే సమయంలో ప్రయివేటు విద్యాసంస్థలు ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా కళాశాలలను అభివృద్ధి చేసుకుని ముందుకుపోతున్నారు. ఇలాంటి సమయంలో గత చరిత్ర ఎంతో ఘనంగా ఉన్నా ఎపిఆర్‌జెసి ఇలా దీనస్థితికి చేరుకోవడంపై విద్యావేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శిథిలమైన తరగతి గది

వేధిస్తున్న సౌకర్యాల కొరత

36 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ కళాశాల భోజన తయారీ భవనం శిథిలావస్థలో ఉంది. నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దురదృష్టకరం. విద్యార్థులు భోజనం చేసేందుకు కూడా సరైన వసతులు లేక పూర్వ విద్యార్థులు సహకారంతో నిర్మించిన ఓ రేకుల షెడ్డులో భోజనం చేస్తున్నారు. అక్కడ కూడా సరైన వసతి సౌకర్యాలు లేవు. ఈ కళాశాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి 36 సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటికీ ఏ ఒక్క నూతన భవనం ఏర్పాటు చేయలేదు.

సిఎస్ఆర్ నిధులతోనైనా పూర్వ వైభవం వచ్చేనా..?

కొడిగినహళ్లి ఏపీఆర్జేసీ జూనియర్ కళాశాల అభివృద్ధికి కియా పరిశ్రమ నిర్వాహకులు నిధులు కేటాయిస్తుండటంతో సిఆర్ఎస్ నిధుల ద్వారా పూర్వవైభవం వచ్చేనా అన్న ఆశలు కలుగుతున్నాయి. పెనుగొండ కేంద్రంగా ఏర్పాటు చేసిన కియా పరిశ్రమ యాజమాన్యం రూ.2.86 కోట్ల రూపాయల మేరకు నిధులు కేటాయించింది. దీని ద్వారా కళాశాలలో రెండు డార్మెటరీ భవనాల ఏర్పాటు తోపాటు డైనింగ్ హాల్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ నిధులకు తోడు ప్రభుత్వం కూడా అవసరమైన నిధులను విడుదల చేసి శిథిలావస్థల్లో ఉన్న తరగతి గదుల మరమ్మతులు చేయడం, సాంకేతిక విద్యను అందుబాటులోకి తేవాలి్సఉ ంది. తేవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు.



సిఎస్ఆర్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులు

సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు

కియా పరిశ్రమ విడుదల చేసిన సిఎస్ఆర్ నిధుల ద్వారా ఎపిఆర్‌జెసిలో ఇటీవల కొన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్యార్థులకు అన్ని వసతులతో కూడిన బాత్రూంల నిర్మాణాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించాం. వీటితోపాటు మరిన్ని అభివృద్ధి పనులను కళాశాలలో జరుగుతున్నాయి. ఇవన్నీ పూర్తయితే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

శ్రీదేవి, ఎపిఆర్‌జెసి ప్రిన్సిపల్, కొడిగనహళ్లి.



సభను 'సూపర్‌హిట్' చేద్దాం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు ఇచ్చాం
- సభ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి
- రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 10వ తేదీన అనంతపురంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'సూపర్ సిక్స్, సూపర్‌హిట్' సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శుక్రవారం నాడు ఆయన రామ్‌నగర్‌లోని షిర్డీసాయి కళ్యాణమండపంలో టిడిపి ఎమ్మెల్యేలు, ఎంపీలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ ఏర్పాట్లపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం జిఎంఆర్ గ్రౌండ్ సభావేదిక వద్ద ఎంపి బికె.పార్థసారధి, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, గుంటూరు మేయర్ నాని, ఆప్కాబ్ ఛైర్మన్ గండి వీరాంజినేయులు, ఆహుడా ఛైర్మన్ టిసి.వరుణ్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూలనాగరాజు, టిడిపి జిల్లా పరిశీలకులు వెంకటేశ్వర్లు, సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సూపర్-6 ద్వారా అమలు చేసి పాలనను సూపర్ హిట్ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు దక్కిందన్నారు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, పింఛన్ల పెంపు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్ల ప్రారంభం తదితర వాగ్దానాలను అమలు చేశామన్నారు. వీటితో పాటు మెగా డీఎస్సీతో నిరుద్యోగులకు ఉద్యోగాలకు ఇచ్చామన్నారు. పరిశ్రమలకు ఏర్పాటు చేస్తూ యువతకు ఉపాధి కల్పించే దిశగా ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల వద్ద గర్వంగా చెప్పుకునేందుకు నిర్వహిస్తున్న సూపర్‌హిట్ సభను విజయవంతం చేసేలా ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబాబు నాయుడు అనంతపురం అర్బన్ నియోజకవర్గంపై ఎంతో నమ్మకం ఉంచి నిర్వహణ బాధ్యతలను అప్పగించారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా 44వ సంవత్సరాల తర్వాత జిల్లాలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంకు ఛైర్మన్ జెఎల్.మురళి, మాజీ మేయర్ స్వరూప, జిల్లా పరిశీలకులు సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.



కణేకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి-కణేకల్లు

మహమ్మద్ ప్రవక్త 1500 జయంతి సందర్భంగా శుక్రవారం కణేకల్లులోని ముస్లింలు మిలాద్ ఉన్ నబి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. హజరత్ సయ్యద్ షా అబ్దుల్ వహాబ్ ఖాద్రి, జామియా మజీద్ ఎడిటర్ ముతవల్లి ముర్షద్ పీర్ ఖాద్రి, సయ్యద్ నేమ్‌తుల్లా ఖాద్రి, ప్రభుత్వ ఖాజీ సయ్యద్ ఎండి ఖాజీమ్ పాషా ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక దిగువ వీధి మదీనా మజీద్ నుంచి ప్రధాన రోడ్డు వైపుగా దివాన్ పీర్ దర్గా వరకూ జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. వహాబ్ ఖాద్రి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చెప్పిన విధంగా ముస్లింలు తప్పనిసరిగా శాంతియుతంగా నడుచుకోవాలని సూచించారు. ఆయన వ్యాఖ్యలు, పద్ధతులను ప్రతి ముస్లిం విధిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో షేక్ ఫకృద్దీన్‌సాబ్, ఎంసి శర్మాస్, షబ్బీర్, షేక్‌గౌస్‌సాబ్, నబిరసూల్, వందలాది సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'



ప్రజలతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 19, 22 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెం టీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కౌన్సిలర్లు శారద, లావణ్య, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజకు వివరించారు. అలాగే సూపర్ సిక్స్ పథకాలు, ఎన్నికల హామీలు, సిఎం చంద్రబాబు మోసాలపై వైసిపి రూపొం దించిన క్యూఆర్ కోడ్ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ. 1,500, విద్యుత్ ఛార్జీల పెంపు, తదితర వాటిపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, మేకల శ్రీనివాసులు, పొరాలు శివ, రామాంజనేయులు, బషీర్, నిజాం, ఆనంద్, ఇస్మాయిల్, రఘురాం, రాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన సర్వేపల్లి

ప్రజాశక్తి-అనంతపురం

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య హెచ్.సుదర్శన రావు పేర్కొన్నారు. అనంతపురం విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణంలో ఉన్న సర్వేపల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విసితో పాటు ఒస్డ్ టూ వీసీ ఆచార్య ఎన్. దేవన్న, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కృష్ణయ్య తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి సర్వేపల్లి ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.చెన్నా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.





ముఖ్యమంత్రి నుంచి అవార్డులు అందుకుంటున్న ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి, శారద, ఓంప్రకాష్

ఉత్తమ అవార్డులు అందుకున్న జెఎన్‌టియు ఆచార్యులు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వ విద్యాలయంలో నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకులుగా ఎన్నికైన ముగ్గురు ఆచార్యులు బుధవారం నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సీనియర్ ఆచార్యులు బి.ఈశ్వర్ రెడ్డి, కెమికల్ ఇంజినీరింగ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.శారద, మెకానికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఓంప్రకాష్‌లు అవార్డులు అందుకున్నారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులు మీదుగా అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందని వారు తెలియజేశారు. వీరికి వైస్‌ఛాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, బోధన, బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గురువులు సమాజ మార్గదర్శకులు : ఎమ్మెల్యే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

గురువులే సమాజానికి మార్గదర్శకులని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. పట్టణం లోని ప్రజావేదికలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లా డుతూ తల్లిదండ్రుల తర్వాత గురువులే దైవమన్నారు. దేశభవిష్యత్తుకు దోహదపడే పౌరులను తీర్చిదిద్దే అవకాశం గురువులకే దక్కుతుందన్నారు. భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని అందరూ గర్వంగా జరుపుకోవాలన్నారు. ఉపాధ్యాయులను గత పాలకులు ఎంతో మానసిక క్షోభకు గురి చేశారని ఆరోపించారు. మంత్రి నారా లోకేష్, జిల్లా లెక్టర్‌తో మాట్లాడి నియోజకవర్గ పరిధిలో ఉపాధ్యాయ భవనానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. అలాగే విశ్రాంత ఉద్యోగుల భవనంలో పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను సన్మానించారు. విశ్రాంత ఉపాధ్యాయులు నాగభూషణం, చెంగలయ్య, చిన్న ఈశ్వరప్ప, నరసింహప్ప, బసన్న, రాజన్న, చంద్ర మౌళిలను రిటైర్డ్ ఉపాధ్యాయులు మరెన్న, కృష్ణ మూర్తి, కృష్ణయ్యచౌదరి, పాండురంగ, మల్లికార్జున, హంపన్న, ఓబుళప్ప, తదితరులు సన్మానించారు. కార్యక్రమంలో యార్డ్ ఛైర్మన్ లక్ష్మీదేవి, వైస్‌ఛైర్మన్ కోనంకి రాజశేఖర్, ఆర్డీఓ వసంత బాబు, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ వైపి.రమేష్, సీనియర్ నాయకులు మల్లికార్జున, కౌన్సిలర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అవార్డు మరింత బాధ్యతను పెంచింది

అనంతపురం : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచిందని కోణంకి శ్రీధర్ ప్రజాశక్తితో తెలిపారు. తాను చదివిన కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకుడుగా పని చేస్తున్నాని తెలిపారు. అధ్యాపక వత్తిలో ఎంతో ప్రతిష్టత్మకమైన రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు రావడం ఆనందంగా ఉందన్నారు. గురుపూజోత్సవ సందర్భంగా తనకు విద్యను బోధించిన గురువులందరినీ స్మరించు కుంటున్నట్లు తెలియజేశారు.



ముఖ్యమంత్రి నుంచి అవార్డులు అందుకుంటున్న కోనంకి శ్రీధర్

ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ విద్యావ్యవస్థను పరిరక్షించాలని ఎంఇఒ వెంకటరమేష్ కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాయదుర్గ్ సిటిజన్స్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో క్లబ్ అధ్యక్షులు తాయి శ్రీనివాసులు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఇఒ మాట్లాడుతూ గతంలో ఉపాధ్యాయులకు సమాజంలో ఎంతో గౌరవం, ఆదరణ ఉండేదన్నారు. ప్రస్తుతం గురువులు విద్యార్థులను చూసి భయపడే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. క్లబ్ రజతోత్సవ వేడుకల్లో గురువులను గౌరవించడం హర్షణీయమన్నారు. అనంతరం పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు ఓబులేసు, హుమేరా, శోభ, రాము, ఉషారాణి, రాజకుమార్, వీరాంజనేయులు, నాగేంద్ర, అరుణ, శివశంకర్, ప్రదీప్, లలితలను క్లబ్ నిర్వాహకులు శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పొరాలు ధనార్జన, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, క్లబ్ క్యాంప్ ఛైర్మన్ అబ్దుల్ మాలిక్, సభ్యులు రవికుమార్, శ్రీనివాసులు, సత్య నారాయణ, అబ్దుల్లా, ఉమామహేశ్వరయ్య, అంబాజీరావు, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళి అర్పిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విద్యార్థులకు శాస్త్రీయ జ్ఞానాన్ని అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ ఎమ్మెల్సీ, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎం.గేయానంద్ తెలిపారు. శుక్రవారం నగరంలోని జెవివి జిల్లా కార్యాలయంలో జెవివి జిల్లా అధ్యక్షులు కె.చిత్తప్ప అధ్యక్షత ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు శాస్త్రీయ దృక్పథంతో బోధించే బోధనలే సమాజంలో మార్పులు తీసుకురాగలవన్నారు. అలాంటి మార్పులు దేశాభివృద్ధికి ఎంతో ఉపయోగం అన్నారు. జెవివిలో పనిచేస్తున్న టీచర్లందరూ కూడా ఆ దిశగా కృషి చేయాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఎంత అవసరమో.. శాస్త్రీయ జ్ఞానాన్ని పెంపొందించే విద్య కూడా అంతే అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కెంచా లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.ప్రసూన, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు, కోశాధికారి మహమ్మద్ జిలాని, ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సమతా జిల్లా కన్వీనర్ రాధ, జెవివి జిల్లా నాయకులు గాంగేనాయక్, అర్జున్‌నాయక్, తిరుపాలు, నాగరత్న, రాజ్యలక్ష్మి, లలిత, రామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ప్రసాద్, రాఘవేంద్ర, శాంతరాజు, తిప్పేస్వామి, సింహాద్రి, రత్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

అయోమయంలో రైతాంగం

సాగు తగ్గినా.. తప్పని యూరియా కష్టాలు - 9న ర్యాలీలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం


విలేకరులతో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అయోమయంగా మారిందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శుక్రవారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతింటే ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ అందించలేదన్నారు. ఈ ఖరీఫ్‌లో కూడా పరిస్థితి అలాగే ఉందన్నారు. జూన్ 10వ తేదీ తర్వాత ఆగస్టు 10వ తేదీ వరకూ జిల్లాలో వర్షాలు కురవలేదన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఖరీఫ్ సీజన్‌కు ముందు, ఆ తర్వాత ప్రభుత్వాన్ని అప్రమత్తం చేస్తూ రైతుల పరిస్థితి తెలియజేసినా పట్టించుకోలేదని మండిపడ్డారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో సాగు విస్తీర్ణం తగ్గినా తగినంత యూరియా ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది.. గతం కంటే ఎక్కువ ఇచ్చామని ప్రకటనలు చేస్తున్న నాయకులు మరి అంతా ఎక్కడికి వెళ్లిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో డిస్ట్రిబ్యూటర్ల నుంచి ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు యూరియా తరలిపోవడంతోనే ఈ పరిస్థితి దాపురించింద.ఇ ఆరోపించారు. రైతాంగ సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నించినా, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా, పత్రికల్లో కథనాలు రాసినా.. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి బెదిరిస్తారా? అంటూ మండిపడ్డారు. మరోవైపు రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర కల్పించలేకపోయారన్నారు. హెచ్‌ఎల్‌సికి నీరు వస్తున్నా నార్త్, సౌత్ కెనాల్లకు నీరు విడుదల చేయలేదని మండిపడ్డారు. తక్షణం నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాతలపై ప్రభుత్వ చిన్నచూపు చూస్తే ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. రైతాంగ సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 9వతేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిరసన ర్యాలీలు చేపట్టి ఆర్డీఓలకు వినతిపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. రైతులు పెద్ద ఎత్తున ర్యాలీల్లో పాల్గొని ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

బినామీల కోసమే మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ

ముఖ్యమంత్రి చంద్రబాబు తన బినామీలు, అనుచరులకు కట్టబెట్టేందుకే మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరిస్తున్నారని అనంత మండిపడ్డారు. రాష్ట్రంలో పేదలకు వైద్య విద్యను దూరం చేసే కుట్రలో భాగంగానే కేబినెట్ నిర్ణయాలు ఉన్నాయన్నారు. వైసిపి హయాంలో విజయనగరం, ఏలూరు, రాజమహేంద్రవరం, మచిలీపట్నం, నంద్యాల కళాశాలలు ప్రారంభించి 750 ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం 10 మెడికల్ కళాశాలలను ప్రయివేట్‌పరం చేయడానికి కేబినెట్ నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ఆరోగ్యశ్రీ పథకం కవరేజీ కూడా రూ.25 లక్షల వరకూ అందజేసిన జగన్‌దే అన్నారు. ఇప్పుడు ఆరోగ్యశ్రీ పథకాన్ని బీమా కిందకు తీసుకొస్తే పేద, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోకపోతే ప్రజా సంఘాలు, ఇతర పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రైతులు అపోహలను నమ్మొద్దు

శింగనమల : రైతులు ఎలాంటి అపోహలను నమ్మొద్దని అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకటరాముడుతో కలిసి శుక్రవారం మండల పరిధిలోని తరిమెల గ్రామ రైతు సేవాకేంద్రంలో యూరియా పంపిణీని పర్యవేక్షించారు. ఇందులో భాగంగా రైతులు ఏఏ పంటలు వేశారు.. యూరియా పంపిణీ ఎలా సాగుతోందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భైరవ ఫర్టిలైజర్స్, నిత్య ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు చేసి ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయం అధికారి అన్వేష్‌కుమార్ పాల్గొన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

యాడికి : ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి చొరవతో శుక్రవారం మండల కేంద్రంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి యాడికి పర్యటనలో భాగంగా స్థానికులు వీధి లైట్ల సమస్య విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే స్థానిక నాయకులతో వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, సర్పంచు పండు అనురాధ, మాజీ ఎంపిటిసి దడియాల ఆది, టిడిపి నాయకులు నరసింహ చౌదరి, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

ఉరవకొండ : వజ్రకరూరు మండలం పరిధిలోని చిన్నహోతూరు ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న టి.రజినీకుమారి ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మతో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు రజినీకుమారిని అభినందించారు.

నార్పల : మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన లగినేని కృష్ణయ్య శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లాకేంద్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కృష్ణయ్య తాడిమర్రి మండలం కునుకుంట్ల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న కృష్ణయ్యను పలువురు సహచర ఉపాధ్యాయులు, విద్యాధికారులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులు ప్రత్యేకంగా అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం

గుత్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పని చేస్తామని మాజీ ఎంపిపి, డోన్ వైసిపి ఎన్నికల పరిశీలకులు కోనా మురళీధర్‌రెడ్డి, గుత్తి పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు డి.హుస్సేన్ పీరా అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ కార్యాలయంలో వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాల్మీకి శివ, వైసిపి నాయకులు రాజన్న, బి.రమేష్‌రెడ్డి, పి.సునీల్‌కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ హిట్'ను విజయవంతం చేద్దాం

బుక్కరాయసముద్రం : జిల్లాకేద్రంలో ఈనెల 10వతేదీన సిఎం చంద్రబాబు నిర్వహించనున్న 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' బహిరంగ సభను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి సిఎం సభపై చర్చించారు. అనంతరం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, గుంటూరు మేయర్, ఉమ్మడి అనంతపురం జిల్లా టిడిపి అబ్జర్వర్ కోవెలమూడి రవీంద్ర, సహచరతో కలిసి సభావేదిక, ప్రజలు, కార్యకర్తల గ్యాలరీలు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడపిఇ నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అద్దె బస్సు డ్రైవర్ల నిరసన

డ్రైవర్, కండక్టర్‌పై జక్కలచెరువు యువకుల దాడి - చర్యలు చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్


నిరసన తెలుపుతున్న హయర్ బస్సు డ్రైవర్లు

తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ తాడిపత్రి రూరల్ పరిధిలోని కడప రోడ్డులో ఉన్న హయర్ బస్సుల గ్యారేజీ వద్ద హయర్ బస్సుల డ్రైవర్లు శుక్రవారం నిరసన చేపట్టారు. తాడిపత్రి - గుత్తి మార్గంలో తిరిగే పల్లె వెలుగు హయర్ బస్సు డ్రైవర్ అనిల్‌కుమార్, కండక్టర్ బాలచంద్రపై గురువారం సాయంత్రం జక్కలచెరువు గ్రామానికి చెందిన యువకులు దాడి చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం హయర్ బస్సుల గ్యారేజీల నుంచి బస్సులు తీయకుండా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్, కండక్టర్‌పై యువకులు దాడి చేస్తే విషయాన్ని తాడిపత్రి ఆర్టీసీ డిపో మేనేజర్ మురళికి వివరిస్తే నిర్లక్ష్యంగా మాట్లాడటం తగదన్నారు. ప్రయాణికులు ఆపినప్పుడు బస్సు ఆపాల్సిందేనని.. లేకపోతే ప్రయాణికులకు ఆవేశం వచ్చి దాడులకు పాల్పడతారని.. ఇది సాధారణమనే విధంగా సమాధానమిచ్చి నిర్లక్ష్యంగా కొట్టి పారేయడం ఎంత వరకూ సమంజమని ప్రశ్నించారు. ఇప్పుడు చిన్నపాటి దాడే జరిగింది. రానున్న రోజుల్లో ఇంకా ఏమైనా జరిగితే తమకు బాధ్యులు ఎవరి ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఘటనపై ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు కలిసి తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇకపోతే హయర్ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై యువకులు దాడి చేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడిపత్రి మండల కార్యదర్శి రాజారామిరెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. గతంలో కొంతకాలంగా రైతు సంఘం తాడిపత్రి మండల కమిటీ సభ్యుడిగా ఉండి తన స్వగ్రామం ఇగుడూరు గ్రామంలో ఉన్న వ్యవసాయంలో రాణించలేక డ్రైవర్ వృత్తిపై ఆధారపడి హయర్ బస్సు డ్రైవర్‌గా కొనసాగుతున్న అనిల్‌కుమార్‌పై జక్కలచెరువు యువకులు దాడి చేయడం బాధాకరమన్నారు. వెంటనే బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గురుకులాల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ఎంపి అంబికా, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం


నీటి ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎంపి అంబికా, ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పించేందుకు విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఎనలేని కృషి చేస్తున్నారని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శుక్రవారం మండలం కొర్రపాడు గ్రామంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఎంపి నిధులు రూ.5 లక్షలతో ఏర్పాటు చేసిన శుద్ధి జలకేంద్రాన్ని ప్రారంభించారు. ముందుగా పాఠశాలలోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. తర్వాత మొక్కల్ని నాటారు. అక్కడి నుంచి తాగునీటి ఆర్‌ఒ ప్లాంట్ శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. తర్వాత ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలుకు సంబంధం లేకుండా విద్యార్థుల తల్లిదండ్రులతో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఏర్పాటు చేయడంతోపాటు టీచర్-పేరెంట్ సమావేశాలు నిర్వహించి విద్యాభ్యాసం కోసం కృషి చేస్తున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం విద్యాలయాల్లో కేవలం రాజకీయ రంగులు, బొమ్మలు, పేర్లు వేసి విద్యావ్యవస్థను అస్తవ్యస్తంగా చేసిందని విమర్శించారు. అయితే 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డొక్కా సీతమ్మ పథకం కింద నాణ్యమైన భోజనాన్ని అందించారన్నారు. అలాగే సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో విద్యాసామగ్రి కిట్లు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు, మాతా ఫుడ్స్ సంస్థ ఛైర్మన్ పసుపల శ్రీరామిరెడ్డి విద్యార్థులకు కావాల్సిన క్రీడా కిట్లు అందజేసేందుకు ముందుకు రావడంపై కృతజ్ఞతలు తెలిపారు. అలాగే విద్యార్థులకు వేచి ఉండే బస్సుషెల్టర్ ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థ తరపున కృషి చేసిన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి అధికార ప్రతినిధి శ్రీధర్‌బాబు, సీనియర్ నాయకులు రవీంద్ర, ఎంపిటిసి ఆదెన్న, కాలువ ప్రెసిడెంట్ సోము, ఎంపిపి సునీత, కూటమి మండల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-శింగనమల


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ఎరువుల దుకాణదారులు రైతులకు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్‌లో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ ఆగ్రో ఏజెన్సీ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ బుక్కులు, గోడౌన్‌లోని ఎరువులను తనిఖీ చేశారు. అనంతరం అక్కడే ఉన్న రైతులతో ఎరువులపై ఆరాతీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదన్నారు. రైతుకు కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయించొద్దన్నారు. అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి తస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.శేషారెడ్డి, అగ్రికల్చర్ ఏవో అన్వేష్‌కుమార్, డిప్యూటీ తహశీల్దార్ సూర్యప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

చీనీ తోటను సందర్శించిన కలెక్టర్

మండల పరిధిలోని పెద్ద జలాలపురం గ్రామంలో రైతు రామయ్య సాగు చేస్తున్న చీనీతోటను కలెక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా 2.5 ఎకరాల్లో చీనీ పంటను సాగు చేస్తే కొన్ని వాడు పట్టి చెట్లు చనిపోయినట్లు రైతు వాపోయాడు. చెట్లు ఎలా చనిపోతున్నాయని జిల్లా ఉద్యానవన అధికారిణి ఉమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేలలోని ఫిజియోరియం విల్టో అనే శిలీంద్రం వల్ల వేరుకుళ్లు తెగులు వచ్చి చెట్టు అంతా చనిపోతున్నట్లు వివరించారు. అనంతరం తెగులు నివారణకు రైతుకు సలహాలు, సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపిఎంఐపి పీడీ రఘునాథరెడ్డి, ఎడిహెచ్ దేవానంద్, మండల ఉద్యాన అధికారిణి శైలజ, గ్రామ ఉద్యాన సిబ్బంది నేత్ర, పవన్‌కుమార్, రమేష్, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

ఆటో డ్రైవర్ల సంఘాల నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



మాట్లాడుతున కార్మిక సంఘాల నాయకులు

ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు, ఎఐటియుసి, ఎఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియు కార్మిక సంఘాల అనుబంధ ఆటో యూనియన్ల నాయకులు హెచ్చరించారు. శుక్రవారం నగరంలోని తరిమెల నాగిరెడ్డి భవన్‌లో జాయింట్ యాక్షన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎంతోమంది డిగ్రీలు, పీజీలు చేసి ఉద్యోగాలు రాక, చేయడానికి పనులు లేక, ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహం ఇవ్వకపోయినా ఫైనాన్స్ కంపెనీల నుంచి ఆటోలు తీసుకుని నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి రంగంలోకి ర్యాపిడో, ఊబర్, ఓలా వంటి ప్రయివేటు ఏజెన్సీలు రంగంలోకి దిగి ఆటో డ్రైవర్ల ఉపాధిని గండి కొడుతున్నాయన్నారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్త్రీశక్తి పథకాన్ని ప్రవేశపెట్టి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. ఆయా వాటిపై ఆటో డ్రైవర్ల అందరిని ఐక్యం చేసి ఉద్యమించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ నగర కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షుడు ఆజంబాషా, కోశాధికారి ఆదినారాయణ, మహిళా కన్వీనర్ స్వాతి, ఎఐఎఫ్‌టియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు హాజీవలి, నాయకులు ఎం.రాజా, డి.రాజా, షరీఫ్‌బాషా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి లతీఫ్, ఎఐటియుసి ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు, రాజు, నగర కార్యదర్శి కృష్ణానాయక్, వైఎస్‌ఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి, రామాంజనేయులు, అనిల్, అంబులెన్స్ యూనియన్ నాయకులు రాజు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు..

ఎరువుల దుకాణాలు తనిఖీ

ప్రజాశక్తి-నార్పల


మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సి, శ్రీ తిరుమల ట్రేడర్స్, వెంకటేశ్వర కెమికల్స్, ఫర్టిలైజర్స్, లక్ష్మీగణేష్ ఫర్టిలైజర్స్ దుకాణాల్లో నార్పల, శింగనమల తహశీల్దార్లు అరుణకుమారి, శేషారెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు, యూరియా నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నార్పల మండలంలో 35 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. మరో పదిరోజుల్లో మండలానికి 40 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందన్నారు. కావున ప్రతి రైతుకూ రెండు బస్తాల చొప్పున యూరియా సరఫరా చేయాలని దుకాణదారులను ఆదేశించారు. అదేవిధంగా ఎంఆర్‌పి ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు తీసుకున్న ఎరువులకు ఖచ్చితంగా రసీదులు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'దండు'కు అభినందనలు

పుట్లూరు : శింగనమల నియోజకవర్గ మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా నియమితులైన టిడిపి నాయకులు దండు శ్రీనివాసులును మండల నాయకులు అభినందించారు. ఈమేరకు శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ క్యాంపు కార్యాలయంలో దండు శ్రీనివాసులును కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన జిఆర్ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురువును మించిన దైవం లేదు..

ఉపాధ్యాయ దినోత్సవంలో వక్తలు



ఎల్ఆర్‌జి స్కూల్‌లో నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక జెఎన్‌టియు అనుబంధ తైల సాంకేతిక, ఔషధ పరిశోధన సంస్థలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి ప్రాథమిక స్థాయి మొదలుకుని ఉన్నత విద్యాభ్యాసం ముగించే వరకు గురువు విశిష్ట పాత్రను వివరించారు. అలాగే గురువులు విద్యార్థి యొక్క జీవిత గమనాన్ని ప్రతిభావంతంగా, ఉత్తేజకరంగా నిర్మించడంలో కీలకమైన పాత్రను పోషిస్తారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రపంచంలో గురువును మించిన దైవం లేదని జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య అన్నారు. నగర సమీపంలో ఉన్న ఎల్ఆర్‌జి స్కూల్‌లో గురుపూజ్యోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కృష్ణయ్య మాట్లాడుతూ గురువు లేని విద్య సూన్యం అన్నారు. అదే గురువు నేర్పిన విద్యకు తిరుగులేదన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ రాఘవయ్య, ఎల్ఆర్‌జి స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ బొంతు ప్రసాద్, కరెస్పాండెన్స్ శేఖర్, సిస్టర్ లియా, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఉరవకొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌కె ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శాశావళి, తెలుగు లెక్చరర్ ఎర్రిస్వామి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ పరమేష్, ఫిజిక్స్ లెక్చరర్ రాజేష్, స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సింగనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్, పాల్తూరులో విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి, కె.వేదమూర్తి, గణేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, ఎంసి నాగభూషణ, కె.బాలచంద్ర, ఆర్.సత్యనారాయణ, ఎం.విశ్వనాథ్, నూర్ మహమ్మద్, శ్రీరాములు పాల్గొన్నారు.


బెళుగుప్పలో గురువులను సన్మానిస్తున్న దృశ్యం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీడాపోటీల్లో (మ్యూజికల్ ఛైర్స్) గెలుపొందిన ఉపాధ్యాయినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారెన్న, విశ్రాంత ఉపాధ్యాయులు సిరిపురం నాగరాజు, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

అలాగే మండల కేంద్రంలోని శ్రీనివాస విద్యానికేతన్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు వీణ, శివకుమార్, మృత్యుంజయను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ వి.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు వి.సుమ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : స్థానిక విజన్ విద్యాసంస్థలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజన్ హైస్కూల్ విద్యాసంస్థల అధినేత కరస్పాండెంట్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


బ్రహ్మసముద్రం : కడుపునొప్పి తాళలేక ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. రాయదుర్గం పట్టణంలోని కోటవీధిలో నివాసం ఉంటున్న చాకలి వన్నూరు స్వామి(50) వృత్తిని నమ్ముకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో గత బుధవారం వేపులపర్తి గ్రామ సమీపంలో వేదవతి-హగిరి నది వద్ద దుస్తులు ఉతకడానికి వెళ్లాడు. అక్కడ స్పృహ కోల్పోయి పడి ఉండగా అటుగా వెళ్తున్న వారు గమనించి వేపులపర్తి గ్రామంలో ప్రథమ చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే వన్నూరుస్వామి అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా వన్నూరుస్వామి ఎలుకల మందు తాగడంతోనే మృతి చెందాడని ప్రాథమిక నిర్ధారణలో తేలింది. అతడి భార్య వన్నూరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

చెరువులో పడి బాలుడు..

రాయదుర్గం రూరల్ : మండలంలోని ఆయతపల్లి గ్రామంలో స్నేహితుడితో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ కాలుజారి చెరువులో పడి మైలారి(9) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గుమ్మగట్ట మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన మల్లయ్య, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మైలారి ఆయతపల్లిలోని అమ్మమ్మ మారెమ్మ వద్ద ఉంటున్నాడు. శుక్రవారం స్నేహితుడు పునీత్‌తో కలిసి ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. పునీత్ ఈ విషయాన్ని వారి కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు హుటాహుటిన వెళ్లి మైలారిని నీటి నుంచి బయటకు తీసి రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

చోరీ చేసి..మళ్లీ తెచ్చిపెట్టి..

హుండీని నగదుతో సహా ఆలయంలో పడేసిన నిందితులు


హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

బుక్కరాయసముద్రం : ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని చోరీ చేసిన నిందితులే తిరిగి నగదుతోపాటు హుండీని ఆలయంలో ఉంచిన ఘటన శుక్రవారం మండల కేంద్రం సమీపంలోని ముసలమ్మ ఆలయంలో చోటు చేసుకుంది. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల మేరకు.. బుక్కరాయసముద్రం పంచాయతీలోని ముసలమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీని గుర్తు తెలియని దుండగులు నెలరోజుల క్రితం చోరీ చేశారు. అయితే గురువారం రాత్రి తిరిగి చోరీ చేసిన హుండీని నగదుతో సహా ఆలయ ఆవరణలో పడేసి వెళ్లారు. ఉదయం గమణించిన ఆలయ పూజాలు, అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సమక్షంలో ధర్మకర్త సుశీలమ్మ, సూర్యనారాయణరెడ్డి, సింగిల్‌విండో ఛైర్మన్ కేసన్న, మాజీ సర్పంచు నారాయణస్వామి ఆధ్వర్యంలో హుండీలోని నగదును లెక్కించారు. అయితే అదే హుండీలో 'మేము నలుగురు వ్యక్తులము హుండీని చోరీ చేశామని, హుండీని ఎత్తుకెళ్లినప్పటి నుంచి మా ఇళ్లల్లో పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని, దీంతో భయపడి అమ్మవారి ఆలయంలోనే హుండీని వదిలేసి వెళ్తున్నాం..' అంటూ లేఖ రాసి ఉండటం గమనార్హం. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అంగట్లో చోరీ

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల గ్రామంలో ఉన్న బాబు అంగట్లో గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తులు బంకుకు పక్కన ఉన్న రేకులను తొలగించి లోపలికి ప్రవేశించి అందులోని రూ.11వేల నగదును చోరీ చేసినట్లు బాధితుడు బాబు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ట్రైనీ ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఉండడంతో సీసీ కెమెరాలు దొంగను గుర్తించినట్లు సమాచారం.